సాక్షి ఒడిశా

శనివారం | 18 | నవంబర్ | 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,27,349
బంగారం	9 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
వెండి	95 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



చవితి సందడి

రాష్ట్రవ్యాప్తంగా నాగుల చవితిని శుక్రవారం భక్తి శ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు.

- 8లో.



నందన్‌కానన్ జూలో రోప్ వే

బారంగ్ నందన్‌కానన్ జులాజికల్ పార్కులో దీర్ఘకాలంగా నిరీక్షిస్తున్న రోప్‌వే విహార సౌకర్యాన్ని మంత్రి ప్రదీప్ కుమార్ అమత్ శుక్రవారం ప్రారంభించారు.

- 8లో.

న్యూస్‌రీల్

తుఫాన్ ముప్పు లేదు

భువనేశ్వర్: ప్రస్తుతం దూసుకొస్తున్న మిథిలీ తుఫాన్ బంగ్లాదేశ్‌లో తీరం దాటనుందని, ఒడిశాకు ఎటువంటి ముప్పు ఉండదని ప్రాంతీయ భారత వాతావరణ శాఖ(ఐఎండీ) సమాచారం. రాష్ట్రంలో ఈనెల 19వ తేదీ వరకు పొడి వాతావరణం ఉండే అవకాశం ఉందని పేర్కొంది. నెలన్నర రోజుల వ్యవధిలో తేజ్, హమూన్ తర్వాత హిందూ మహా సముద్రంలో మూడో తుపానుగా మారిన మిథిలీ ఒడిశాపై ఎలాంటి ప్రభావం చూపే అవకాశం లేదు. తుఫాను శుక్రవారం రాత్రి తీరాన్ని తాకే అవకాశం ఉంది. నవంబర్ 17, 18 తేదీల్లో ఉత్తర మరియు మధ్య బంగాళాఖాతం మీదుగా గంటకు 40 నుంచి 45 కి.మీ వేగంతో వీచే గాలులు 55 కి.మీ వేగం వరకు బలం పుంజుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అన్ని ఓడ రేవుల వద్ద ఒకటో నంబర్ సుదూర హెచ్చరిక సిగ్నల్ జారీ చేసినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది.

ఆశ్రమానికి రక్షణ కల్పించాలి



ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఆశ్రమ వాసులు

రాయగడ: ఈనెల 14వ తేదీన జిల్లాలో కల్యాణ సింగుపూర్‌లోని ప్రముఖ శైవక్షేత్రం దేవగిరిపై ఉన్న క్రాంతికారి ఆశ్రమానికి చెందిన స్వామీ క్రాంతి స్వరూపానంద గిరిపై జరిగిన దాడిని ఆశ్రమ వాసులు, స్థానిక ప్రజలు ఖండించారు. ఈ మేరకు ఆశ్రమానికి కల్పించాలని కోరుతూ కల్యాణ సింగుపూర్ పోలీసులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో గల ఆశ్రమంలో నివసిస్తున్న స్వామిపై దాడి జరగడం బాధాకరమన్నారు. దాడికి పాల్పడిన నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆశ్రమంలో ఎంతోమంది మహిళలు సైతం నివసిస్తున్నారని, వారికి సైతం రక్షణ కల్పించాలని విన్నవించారు.

ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి



కలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద చైతాన్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి సిమిలిమల్లా పంచాయతీ ఎంపీ 116 గ్రామంలో గురువారం రాత్రి ఒక ఇంటర్ చదువుతున్న విద్యార్థి చైతాన్ సేన్ (20) ఇంటిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. చైతాన్ గురువారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. అయితే కొంత సమయం తర్వాత తల్లి లేచి చూస్తే చైతాన్ నోటివెంట నురగలు రావడంతో కంగారుతో కుటుంబ సభ్యులను లేపింది. కుటుంబ సభ్యులంతా చైతాన్‌ను లేపినా లేవకపోవడంతో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ విద్యార్థిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే తమ కుమారుడి మృతి అనుమానస్పదంగా ఉందని కుటుంబ సభ్యులు అంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. చైతాన్ రాయగడలో మిస్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

కొండచిలువ కలకలం



పట్టుబడిన కొండచిలువ

బరంపురం: స్థానిక బెగునపడా బ్లాక్ పరిధి మదనపల్లిలో 13 అడుగుల కొండచిలువ కలకలం సృష్టించింది. స్థానికుల సమాచారంతో స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థకి చెందిన ఆశిరాజ్ తన చాకచక్యంతో 13 అడుగుల కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం దిగపండి అటవీ విభాగం పట్టుకున్న కొండచిలువను చందుడిదేవ్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

- రహదారి సౌకర్యాలు లేని కొండ ప్రాంతాలకు వైద్య సేవలు
- డ్రోన్ ద్వారా మందులు పంపించేందుకు చర్యలు
- సేవలు ప్రారంభించిన మంత్రి సరక



వైద్య సేవలు అందించనున్న డ్రోన్

కొండంత అండ

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రక్రియలో భాగంగా జిల్లాలో డ్రోన్ ద్వారా వైద్య సేవలను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక ఈ కార్యక్రమాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక భారీజోలలో గల జిల్లా ముఖ్యవైద్యాధికారి కార్యాలయ ప్రాంగణంలో డ్రోన్ సేవలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ, హరిజన ప్రాంతమైన ఈ జిల్లాలో అత్యధిక శాతం గ్రామాలు కొండ ప్రాంతాల్లో ఉంటున్న నేపథ్యంలో ప్రజలు సరైన వైద్య సేవలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన అటువంటి ప్రాంతాలకు డ్రోన్ సాయంతో అత్యవసరమైన మందులు అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి తరహా ఆధునిక సేవలు ప్రజలకు అందుబాటులోకి రావడం హర్షణీయమని పేర్కొన్నారు. జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్ మాట్లాడుతూ రాయగడ జిల్లాలో మొత్తం 3,234 గ్రామాలు ఉండగా, ఇందులో 800 గ్రామాలకు అత్యంత కష్టతరంగా వైద్య సేవలను అందించగలుగుతున్నామన్నారు. అదేవిధంగా మరో 160 గ్రామాలకు రాకపోకల సౌకర్యాలు లేకపోవడంతో వైద్య సేవలు అందించడంలో ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తోందని తెలియజేశారు. అటువంటి ప్రాంతాలకు డ్రోన్‌ద్వారా మందులు సులభంగా సరఫరాల చేయవచ్చన్నారు. రెడ్‌వింగ్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ఈ సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.



డ్రోన్ సేవలు ప్రారంభిస్తున్న మంత్రి సరక

ఒకేసారి 1.5 కిలోల బరువు..

రెండ్‌వింగ్ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగనున్న ఈ వైద్య సేవల గురించి ఆ సంస్థ ఎండీ కుందన్ మెడిరెడ్ వివరించారు. ఈ డ్రోన్ సాయంతో ఒకసారి సుమారు 1.5 కిలోల బరువుగల వస్తువులను పంపించవచ్చన్నారు. దాదాపు 300 కిలోమీటర్ల దూరం నుంచి ఈ డ్రోన్‌ను ఆపరేటింగ్ చేసే సౌకర్యం ఉందని వెల్లడించారు. అనంతరం రాయగడ నుంచి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో గల జిల్లాలోని గుడారికి ఈ డ్రోన్ ద్వారా 1.5 కిలోల టీకాల కిట్‌ను అక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ట్రైల్ బేస్‌లో పంపించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఏఎస్పీ విష్ణుప్రసాద్ పాత్రో, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతీ మాఝి, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, రాష్ట్ర బిజు స్వస్థ్య సమితి ముఖ్య సలహాదారుడు సుధీర్ దాస్, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి పాణిగ్రాహికి హెల్త్ గ్లోరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: ఒడియా సాహితీ పత్రిక అపూర్వ 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఉదయం భువనేశ్వర్ న్యూ మారియన్ హోటల్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా గవర్నర్ రఘుబర్ దాస్ విచ్చేయగా, మరో అతిథిగా రాజ్యసభ ఎంపీ మానసరంజన్ మంగరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశాలో వైద్య విద్య, ఆరోగ్య విభాగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, హైటెక్ మెడికల్ విద్యాసంస్థల ద్వారా సేవ చేస్తున్న ఆ సంస్థ చైర్మన్ డా.తిరుపతి పాణిగ్రాహికి గవర్నర్ చేతులమీదుగా హెల్త్‌గ్లోరీ అవార్డుతో సత్కరించారు. ఆయనతో పాటు ఒడిశా గాయకులు బిజయ నాయక్, కవి రక్షక్ నాయక్, రచయిత శ్రీకాంత్ మిశ్రా, చంద్రశేఖర హోత్తాలను సన్మానించారు. కార్యక్రమంలో ఒడిషా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ప్రభాత్‌కుమార్ రౌళో, కాదంబినీ పత్రిక సంపాదకురాలు డా.ఇతిరాణి సామంత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ



విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న బీఎస్ సింగ్

రాయగడ: జిల్లాలో కాసీపూర్‌లోని మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ మైనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా సమితిలోని సుంగేరి పంచాయతీలోని త్రినాథ్‌దేవ ఉన్నత పాఠశాలలో చదువుతున్న హాస్టల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, క్రీడా ఉపకరణాలు శుక్రవారం పంపిణీ చేసింది. సంస్థ ఎన్విరాన్‌మెంట్ జనరల్ మేనేజర్ బీఎస్ సింగ్ ముఖ్య అతిథిగా ఆదివాసీ విద్యార్థులకు అవసరమయ్యే టేబుల్, చైర్, క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్ తదితర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ పరిసర ప్రాంతాల్లో వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అదేవిధంగా నిరుపేదలైన ఎంతోమంది ఆదివాసీ, హరిజన కుటుంబాలకు చేదోడుగా ఉంటున్నామని తెలియజేశారు. నిరుపేదలకు అండగా ఎల్లప్పుడూ ఉంటామని భరోసా ఇచ్చారు. కొద్దిరోజుల క్రితం విద్యుత్ ఘాతానికి గురైన ఒక వ్యక్తి చేయిని తొలగిస్తే ఆ కుటుంబానికి అండగా నిలిచామన్నారు. కార్యక్రమంలో మైత్రీ సంస్థకు చెందిన హెచ్‌ఆర్ అండ్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ కళింగ కుమార్ ధిర్, లియజన్ మేనేజర్ రాజేష్ బిశ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు



అరెస్టైన దోపిడీ దొంగల ముఠా

బరంపురం: నగరంలోని విజయ్ విహార్‌లో నివాసముంటున్న కనకారావు ఇంటిలో కొద్దిరోజుల క్రితం దోపిడీకి పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్డీపీవో అశ్వనీ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 2వ తేదీ అర్ధరాత్రి సదర్ పోలీసుస్టేషన్ పరిధి విజయ్ విహార్ 2వ లైన్‌లో నివాసముంటున్న కనకారావు ఇంటిలో దుండగులు చొరబడి, ఇంటిలో ఉన్నవారికి మారణాయుధాలు చూపించి భయపెట్టారు. అనంతరం ఇంటిలో ఉన్నటువంటి విలువైన బంగారు ఆభరణాలు దోచుకొని పరారయ్యారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు దోపిడీకి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్డీపీవో శుక్రవారం తెలియజేశారు. వారి దగ్గర నుంచి రెండు బంగారం గొలుసులు, ఒక బంగారు మంగళసూత్రం, 4 బంగారం గాజులు, 2 బంగారం రింగులతో పాటు దోపిడీకి వినియోగించిన ఒక ఇనుప రాడ్డు, ఒక చాకు, ఒక స్క్రూ డ్రైవర్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో బాబుల్ బహదూర్, సునీల్ పాఢి, బిపిన్ నాయక్, సూరజ్ పాఢీలు ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. అరెస్టైనవారిని కోర్టులో హాజరుపరిచి జైలుకి తరలించారు.



స్వాధీనం చేసుకున్న నగలు, మారణాయుధాలు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



ఘటనా స్థలంలో మేయర్ సంఘమిత్ర దొళాయి తదితరులు, (ఇన్‌సెట్లో) తీవ్ర గాయలతో విద్యార్థి జమ్మున చరణ్ దాస్

బరంపురం: గంజాం జిల్లా హింజిలికాటు–పట్టపూర్ మధ్య బాలకృష్ణపూర్ గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందాడు. ఐఐసీ అధికారి అభిమన్యు దాస్ తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి పట్టపూర్ నుంచి హింజిలికాటు మీదుగా బైక్‌పై బరంపురం నగరానికి ఇద్దరు విద్యార్థులు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న పోలీసు వ్యాన్ బైక్‌ని ఢీకొనడంతో విద్యార్థులు గాయపడ్డారు. వెంటనే అటువైపు నుంచి వస్తున్న బరంపురం నగర మేయర్ సంఘమిత్ర దొళాయి తన కారులో గాయపడిన విద్యార్థులను హుటాహుటిన బరంపురం ఎంకేసీజీ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జమ్మున చరణ్ దాస్ అనే విద్యార్థి మృతి చెందాడు. మరో విద్యార్థి ప్రస్తుతం తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. పట్టపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25 నుంచి లక్ష్మీ బస్సు సేవలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సింగ్

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలను అందించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా అమలు చేస్తున్న లక్ష్మీ బస్సుల సేవలు జిల్లాలో ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకు ఇప్పటికే రాయగడకు బస్సులు చేరుకున్నాయి. దీనికి సంబంధించి కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఒక ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో రీజనల్ ట్రాన్స్‌పోర్టు అధికారి (ఆర్టీవో) శివప్రసాద్ చౌదరి, ఏఎస్పీ విష్ణుప్రసాద్ పాత్రో, ఏడీఎం భాస్కర రైతా తదితర సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని 11 సమితుల్లో ఈ బస్సు సేవలు త్వరలో ప్రయాణికులకు అందనున్నాయి. అందుకు గాను 298 స్టాపేజీలను జిల్లా యంత్రాంగం గుర్తించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈనెల 25వ తేదీన వర్చువల్‌గా బస్సు సేవలను ప్రారంభించనున్నారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో అందుకు సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయి. సన్నాహాలకు సంబంధించి ఆమె అధికారులతో సమీక్షించారు.



సిద్ధమైన లక్ష్మీ బస్సులు

నాటుసారాపై ఉక్కుపాదం



అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: అస్కా పట్టణ శివారు పాకపల్లి అటవీ ప్రాంతం నుంచి బైకులతో నాటుసారా తరలిస్తున్న వ్యక్తులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గంజాం ఏఎస్పీ ప్రదీప్ కుమార్ దొళాయి తెలిపిన వివరాల మేరకు.. పాకలాపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతం నుంచి బరంపురం వైపు బైకులపై నాటుసారా తరలిస్తున్నట్లు పోలీసులకు శుక్రవారం సమాచారం అందింది. దీంతో అస్కా పోలీసులు దాడులు చేసి 650 లీటర్ల నాటుసారాతో పాటు 12 మంది నిందితులను అరెస్టు చేసి, 9 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అక్రమంగా నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

సహకార సంస్థలతో సమాజ ప్రగతి

- కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ ఈశ్వర చంద్ర



జయపురంలో ర్యాలీ ప్రారంభిస్తున్న ఈశ్వరచంద్ర పాణిగ్రాహి

జయపురం: సహకార సంస్థలు సమాజ ప్రగతికి ఎంతగానో ఉపకరిస్తాయని కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ ఈశ్వర చంద్ర పాణిగ్రాహి అన్నారు. అఖిల భారత సహకార సంస్థల వారోత్సవాల్లో భాగంగా స్థానిక బస్టాండ్ కూడలి నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బిజూ జనతా దళ్ ప్రభుత్వం కృషి వలన సహకార సంస్థలు మరింత బలోపేతమవుతున్నాయని తెలియజేశారు. కేసీసీ బ్యాంక్ రైతులకు రూ.లక్ష వరకు వడ్డీలేని రుణాలు అందజేస్తోందని, మహిళా స్వయం సహాయక గ్రూపు మహిళలకు రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, అలాగే రూ.3 లక్షల వరకు కేవలం 2 శాతం వడ్డీకే రుణాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీస్(డీఆర్‌డీఎస్) భీమసేన్ సాహు, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పటానాయక్, రాష్ట్ర బీజేడీ మహిళా నాయకురాలు మీరా పోరిడ, కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ ఇందిర నందో, మున్సిపల్ ఉపాధ్యక్షురాలు బి.సునీత, కేసీసీ బ్యాంక్ డైరెక్టర్ రమాకాంత రౌళో తదితరులు పాల్గొన్నారు.

సచేతన రథం ప్రారంభం

అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా కొరాపుట్‌లో సహకార సచేతన రథాన్ని ప్రారంభించారు. కొరాపుట్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ పచ్చజెండా ఊపి రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర పాణిగ్రాహి, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలాట రంజన్ సెట్టి, జయపురం డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీ భీమసేన్ సాహు, కొరాపుట్ ఏఆర్‌సీఎస్ దీపక్ కుమార్ రౌత్, కొరాపుట్ ఆర్ఎంసీ అరుణ కుమార్ జెన, కొరాపుట్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కొరాపుట్‌లో సచేతన రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

జింక పిల్లకు చికిత్స


గ్రామస్తులకు పట్టుబడిన గాయపడిన జింక

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ అటవీ రేంజ్ పరిధి నారాయణపూర్ ప్రాంతంలో గురువారం సాయంత్రం ఒక జింక పిల్ల గ్రామస్తులకు తారాసపడింది. కాలుకి గాయంతో ఒక పొలంలో పడి ఉన్న ఆ జింక పిల్లను గ్రామస్తులు పట్టుకుని గుణుపూర్ అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. దీంతో అటవీ శాఖ అధికారులు జింక కాలికి తీవ్రగాయాలయ్యాయని గుర్తించి, వెంటనే సమీపంలోని పశు చికిత్స కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. జింక ఆరోగ్యం కుదుటపడిన అనంతరం తిరిగి దానిని గుణుపూర్ సంరక్షణ అడవుల్లో విడిచిపెడతామని రేంజర్ అశోక్ కుమార్ బెహర తెలియజేశారు.

నూతన సలహాదారుగా సురేశ్ చంద్ర


సురేష్ చంద్ర మహాపాత్రో

భువనేశ్వర్: ముఖ్యమంత్రి కార్యాలయం నూతన ప్రధాన సలహాదారుగా సురేష్ చంద్ర మహాపాత్రో నియమితులయ్యారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ, ఒడిశా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్‌పర్సన్ (ఓఈఆర్‌సీ)గా కొనసాగుతున్నారు. ఈ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా వైదొలగేందుకు అనుమతించారు. కొత్త నియామకంతో ఆర్.బాలకృష్ణన్ సీఎంవో ముఖ్య సలహాదారు అదనపు బాధ్యతల నుంచి వైదొలగి, చీఫ్ సెక్రటరీ హోదాలో స్పెషల్ ఇనీషియేటివ్స్ ప్రధాన సలహాదారుగా కొనసాగుతారు. అసిత్ త్రిపాఠి అభ్యర్థన మేరకు ప్రిన్సిపల్ అడ్వైజర్‌గా తన అదనపు బాధ్యతల నుంచి వైదొలగి పశ్చిమ ఒడిశా అభివృద్ధి మండలి అధ్యక్షునిగా కొనసాగుతారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

తెర్లాం: మండలంలోని కూనాయ వలసలో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు గురువారం రాత్రి దొంగిలించారు. గ్రామంలోని కొందరి రైతులకు సంబంధించిన పొలాలకు మోటార్ల కోసం అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌పై కన్నేసిన దొంగలు దానికి సరఫరా అవుతున్న విద్యుత్‌ను నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసినట్లు ఈపీడీసీఎల్ ఏఈ జోగినాయుడు శుక్రవారం విలేకరులకు తెలిపారు. పవర్ కట్ చేసిన దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందికి దించి అందులో నిక్షిప్తమై ఉన్న రూ.3.50లక్షల విలువైన రాగి, ఇతర భాగాలను చోరీ చేసి ఖాళీ పెట్టిను అక్కడే వదిలేసి పోయారన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

పూరిల్లు దగ్ధం

గరుగుబిల్లి: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక పూరిల్లు కాలిపోయింది. గ్రామానికి చెందిన ఆర్.గవరయ్య ఇంటిలో ప్రమాదవశాత్తు మంటలు రావడంతో ఇల్లు అంటుకుంది. దీంతో గ్రామస్తులు వచ్చి మంటలు అదుపుచేశారు. అయితే ఈ ప్రమాదంలో ఇంటిలో ఉన్న సామగ్రి, పత్రాలు పూర్తిగా కాలిపోవడంతో గవరయ్య లబోదిబోమంటున్నాడు. అధికారులు స్పందించి తనకు జరిగిన నష్టాన్ని పరిశీలించి పరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.

కాలిపోయిన పైపులు

వీరఘట్టం: మండలంలోని విక్రమపురం గ్రామంలో 375 గృహాలకు జలజీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచినీటిని పంపిణీ చేసేందుకు సర్పంచ్ మాచర్ల మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ వెంకటరమణలు శుక్రవారం భూమి పూజచేశారు. రూ.40 లక్షల వ్యయంతో ఇంటింటికీ తాగునీటిని ఇచ్చేందుకు పనులు ప్రారంభించి కుళాయి పాయింట్లు ఇచ్చేందుకు నెలక్రితం తెప్పించిన సుమారు రూ.13 లక్షల విలువ గల ప్లాస్టిక్ పైపులను ఊరు చివర గడ్డివాముల సమీపంలో డంపింగ్ చేశారు. అయితే శుక్రవారం నాగులచవితి కావడంతో పుట్టలో పాలుపోసేందుకు వెళ్లినవారు ఎవరో క్రాకర్స్ వెలిగించారు. దీంతో గడ్డివాముకు నిప్పు అంటుకుని పక్కనే ఉన్న తాగునీటి పైపులు కాలిపోయాయి. సమాచారం మేరకు వెంటనే పాలకొండ అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.6 లక్షల విలువైన పైపులు కాలిపోయాయని అధికారులు అంచనా వేశారు. ఫిర్యాదు మేరకు పరిస్థితిని అదుపు చేశారు.

చవితి సందడి


పర్లాకిమిడి: రాణిపేటలో...


భువనేశ్వర్: ఖుర్దారోడ్ పరిసర ప్రాంతాల్లో...


బరంపురం: దిప్పవీధిలో...


మల్కన్‌గిరి: నాగేంద్రుడికి పూజలు చేస్తున్న రైతు కుటుంబం


పర్లాకిమిడి: కలెక్టరేట్ దగ్గరున్న పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


పర్లాకిమిడి: రాణిపేట వద్ద ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు పాలు పోస్తున్న దృశ్యం


జయపురం: పుట్ట వద్ద బాణాసంచా కాల్చుతున్న చిన్నారులు


రాయగడ: పట్టణంలో పూజలు నిర్వహిస్తున్న ప్రజలు


జయపురం: పూజలు చేస్తున్న మహిళలు

రాష్ట్రవ్యాప్తంగా నాగుల చవితిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. కుటుంబ సమేతంగా పుట్టలను శుభ్రం చేసి, పువ్వులతో అలంకరించారు. ప్రసాదాలు, కోడిగుడ్లు, పాలును పుట్టలో వేసి మొక్కులు చెల్లించుకున్నారు. బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. రైతు కుటుంబాలంతా కలిసి వెళ్లి పూజలు చేసి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని వేడుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మల్కన్‌గిరి: కుమారి వీధిలో...


పర్లాకిమిడి: రాంనగర్‌లో...


బరంపురం: రామలింగేశ్వర్ ఆలయ ప్రాంగణంలో...


జయపురం: పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు


బరంపురం: నీలకంఠేశ్వర్ జామి పడియాలో...


బరంపురం: ప్రేమ్‌నగర్ మెయిన్ రోడ్డులో...

ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం

- బీజేపీ రాష్ట్ర శాఖ అధికార ప్రతినిధి సత్యబ్రత పండా

భువనేశ్వర్: రాష్ట్రంలోని ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం పడుతోందని బీజేపీ రాష్ట్ర శాఖ అధికార ప్రతినిధి సత్యబ్రత పండా అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సామాన్యుడి నెలవారీ బడ్జెట్‌లో ఎక్కువ భాగం విద్యుత్ వినియోగానికి చెల్లించాల్సి వస్తోందని ఆరోపించారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సమాచారం ప్రకారం భారత దేశంలో ఇతర వినియోగదారుల కంటే ఒడిశా వినియోగదారులు ఎక్కువ చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులు యూనిట్‌కు 80 పైసలు పైబడి చెల్లిస్తున్నారని తెలిపారు. సుస్థిర దీర్ఘపాలన బీజేడీ సర్కారు నిర్వాకంతో ఈ పరిస్థితి తాండవించిందని ఆరోపించారు. విద్యుత్ ఉత్పాదన, పంపిణీ ఇతరేతర అనుబంధ కార్యకలాపాల్లో అవినీతి, అక్రమాలు రాష్ట్రంలో సామాన్య వినియోగదారునిపై అవాంఛిత భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో విద్యుత్ చార్జీలు గణనీయంగా పెరుగుతాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పరిస్థితి నివారణపై నిర్మాణాత్మక కార్యాచరణతో ముందుకు రాకుంటే తమ పార్టీ ప్రజా ప్రయోజనాల కోసం ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.


మాట్లాడుతున్న సత్యబ్రత పండా

ఎదురెదురుగా వచ్చిన బైక్‌లు ఢీ

- ఒకరు మృతి

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఉంద్రుకొండ పంచాయతీ ప్రధాన రహదారిలో గురువారం అర్ధరాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో అక్కడికక్కడే ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రమాదంలో కలిమెల సమితి భువనపల్లి పంచాయతీ ఎంవీ 115 గ్రామానికి చెందిన బిప్లబ్ మండల్ (26) మృతి చెందాడు. మరో వ్యక్తి చందన్ మండాల్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరూ కలిసి ఎంవీ 55 గ్రామంలో జరుగుతున్న కాళీపూజ చూసుకొని పోడియ వెళ్తున్నారు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న బైక్ వారి బైక్‌ను ఢీకొంది. దీంతో వెంటనే ఢీకొన్న వ్యక్తి పరారయ్యాడు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గాయపడిన వారిని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే బిప్లబ్ మండల్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నామని కలిమెల ఐఐసీ సత్యానంద్ తెలియజేశారు.


బిప్లబ్ మండాల్ మృతదేహం

ధాన్యం సేకరణపై అపోహలు సృష్టిస్తే చర్యలు

- మద్దతు ధరకే రైతులు విక్రయించాలి
- కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో పండిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. ధాన్యం సేకరణకు పూర్తి ఏర్పాట్లు చేశామని, ధాన్యం సేకరణపై అపోహలు, వదంతులు సృష్టించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మేరకు ధాన్యం సేకరణపై అధికారులు, మిల్లర్లు, లారీ సంఘం ప్రతినిధులతో శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3.23 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి అంచనా వేశామని, రైతులు వారి ధాన్యాన్ని జిల్లాలో ఏర్పాటు చేసిన 185 కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు విక్రయించవచ్చని తెలిపారు. రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకంటే తక్కువకు విక్రయించవద్దని సూచించారు. రైతులను ప్రలోభపెట్టి, ఇబ్బందిపెట్టి తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్రం స్థాయిలో వలంటీర్లతో సమావేశం ఏర్పాటుచేసి ధాన్యం సేకరణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో మొదటి పదిరోజులు కీలకమని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని అంచనా వేసి ముందుగా ఏర్పాట్లు చేయాలని పిలుపునిచ్చారు. ధాన్యం సేకరణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా, రైతుల నుంచి ఫిర్యాదులు లేకుండా సివిల్ సప్లయిస్, రవాణా, వెలుగు, జీసీసీ, వ్యవసాయ, సహకారశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జేసీ ఆర్.గోవిందరావు, ఆర్‌డీఓలు కె.హేమలత, ఎం.లావణ్య, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎం.దేవుళ్ల నాయక్, వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

హత్యకేసులో ముద్దాయికి యావజ్జీవం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: భార్యను హతమార్చాడన్న అభియోగం రుజువు కావడంతో సాలూరు పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన ముద్దాయి సాంపి లక్ష్మణరావుకు జీవితఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ మహిళా కోర్టు న్యాయమూర్తి ఎస్.పద్మావతి శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసుపై అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరువాడ రవీంద్రనాథ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మణరావుకు 17 ఏళ్ల క్రితం సన్యాసమ్మతో వివాహం జరిగింది. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న లక్ష్మణరావు ఇటీవల పని మానేసి మద్యానికి బానిసయ్యాడు. దీంతో పాటు భార్యను అనుమానించసాగాడు. ఈ క్రమంలో 2021 ఏప్రిల్ 28న భార్యతో గొడవ పడగా కుటుంబసభ్యుల జోక్యంతో సద్దుమణిగింది. మరునాడు భార్య తన కుటుంబసభ్యులతో కలిసి మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తుండగా లక్ష్మణరావు కత్తితో ఆమెను పొడిచి పరారయ్యాడు. కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు సాయంత్రం మృతిచెందింది. హతురాలి కుమారుడు యేసువర్ధన్ ఫిర్యాదు మేరు సాలూరు సీఐ కేసు నమోదు చేసి నిందితుడు లక్ష్మణరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలతో కేసు రుజువు చేయడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

నందన్‌కానన్ జూలో రోప్ వే


ప్రారంభించిన రోప్ వే

భువనేశ్వర్: బారంగ్ నందన్‌కానన్ జులాజికల్ పార్కు సందర్శకులు ప్రకృతి రమణీయ అందాలను ఆస్వాదించవచ్చు. దీర్ఘకాలంగా నిరీక్షిస్తున్న రోప్‌వే విహార సౌకర్యాన్ని రాష్ట్ర అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి ప్రదీప్‌కుమార్ అమత్ శుక్రవారం ప్రారంభించారు. మంత్రితో పాటు జట్నీ నియోజక వర్గం ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌత్రాయ్ మరియు ఇతర సీనియర్ అధికారులు ప్రారంభోత్సవం జరిగిన వెంటనే తొలి విహారం చేశారు. రోప్‌వే విహార సౌకర్యం సందర్శకులకు శనివారం నుంచి అందుబాటులోకి వస్తుంది. ఒకరికి రూ.120 చొప్పున రుసుము సందర్శకులు చెల్లించాల్సి ఉంటుంది. ఫొటోగ్రఫీ కోసం కెమెరా తీసుకోవడానికి అదనపు రుసుం చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. దీనికోసం ప్రత్యేక టిక్కెట్ కౌంటర్ ఏర్పాటు చేశారు. వారపు సెలవు మినహా ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోప్‌వే విహారం అందుబాటులో ఉంటుంది. సుందరమైన కంజియా సరస్సు మీదుగా 626 మీటర్ల దూరం ఈ విహారం కొనసాగుతుంది. నందన్ కానన్ జూ ప్రాంగణం నుంచి ప్రారంభమై బొటానికల్ గార్డెన్ వద్ద ముగుస్తుందని అధికారులు తెలిపారు. ఒక విడతలో 72 మంది సందర్శకులు రోప్ వే సౌకర్యాన్ని పొందగలుగుతారు.

బత్తిలి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం

భామిని: మండలంలోని బత్తిలి పాత సినిమా హాల్ సమీపంలో పంటపొలాల గట్టుపై గుర్తు తెలియని మృతదేహాన్ని ఎస్సై యతిరాజుల అమ్మాన్ రావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 40 నుండి 45 ఏళ్లు ఉండవచ్చని దివ్యాంగుడి మృతదేహంగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి శరీరంపై నల్లని నిక్కరు ఉందని, శరీరం కుళ్లికృశించి పోయి ఎముకలు బయకు కనిపిస్తున్నాయని చెప్పారు. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామని తెలిపారు. మృతుని వివరాలపై లుకౌట్ నోటీసులు విడుదల చేసి వివరాల కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్సై అమ్మానరావు చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఫోన్ నంబర్లు 6309990884,9490595599కు తెలియజేయాలని కోరారు.


గుర్తు తెలియని మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అమ్మాన్‌రావు, రెవెన్యూ సిబ్బంది

ఇదెక్కడి చోద్యం..!

విజయనగరం ఫోర్ట్: సినీఫక్కీ తరహా ఘటన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద శుక్రవారం జరిగింది. 108 అంబులెన్సులో వచ్చిన రోగిని ప్రైవేట్ అంబులెన్సు నిర్వాహకుడు బలవంతంగా తన వాహనంలో తరలించుకుపోయాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రోడ్డు ప్రమాదంలో తలకు గాయం కావడంతో పైడిరాజు అనే వ్యక్తి చికిత్స కోసం చీపురపల్లి సీహెచ్‌సీలో చేరాడు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేయగా 108 అంబులెన్సులో సిబ్బంది రోగిని సర్వజన ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే సర్వజన ఆస్పత్రి గేటు వద్ద కాపుకాసిన ప్రైవేట్ అంబులెన్సు నిర్వాహకుడు ఒకరు 108 అంబులెన్సు ఆస్పత్రి క్యాజువాలిటీ వద్దకు రాగానే లోపలికి ప్రవేశించి రోగిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించాడు. ఎందుకు ఆరోగిని తరలిస్తున్నావు? మేము ఆస్పత్రిలో చేర్చాలని 108 సిబ్బంది చెప్పగా, ఆ పేషెంట్ తమ పేషెంట్ అని వాదులాడి ఇక్కడితో మీ పని అయిపోయింది. నేను పేషెంట్‌ను తీసుకుని వెళ్తాను. ఏం చేసుకుంటారో? చేసుకోండంటూ పేషెంట్‌ను ప్రైవేట్ అంబులెన్సులో బలవంతంగా ఎక్కించుకుని వెళ్లిపోయాడు. దీంతో 108 సిబ్బంది బి.రవికుమార్, ఎస్.వేణుగోపాల్‌రావులు ఈ విషయమై డీఎంహెచ్‌ఓ, ఆస్పత్రి ఆర్‌ఎంఓకు ఫిర్యాదు చేశారు. ఇదేవిషయాన్ని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆర్‌ఎంఓ సురేష్‌బాబు వద్ద సాక్షి ప్రస్తావించగా క్యాజువాలిటీ ఆవరణ వద్దకు రాగానే ప్రైవేట్ అంబులెన్సు నిర్వాహకుడు పేషెంట్‌ను తన అంబులెన్సులో తరలించినట్లు 108 సిబ్బంది చెప్పారని, ఈ విషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సర్వజన ఆస్పత్రిలోకి ప్రైవేట్ అంబులెన్స్‌లు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

న్యూస్‌రీల్

న్యాయ విద్యలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: మూడేళ్లు, ఐదేళ్ల న్యాయ విద్య (ఎల్‌ఎల్‌బీ) ప్రవేశాలకు శుక్రవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. లాసెట్–2023 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులు. జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మూడేళ్ల ఎల్‌ఎల్‌బీలో 66 సీట్లు ఉండగా, శ్రీకాకుళం పట్టణంలోని వర్సిటీ అఫిలియేషన్ ఎంపీఆర్ కళాశాలలో మూడేళ్ల ఎల్‌ఎల్‌బీలో 88, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీలో 88 సీట్లు ఉన్నాయి. బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా గుర్తింపు కళాశాలకు ఉంది. షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్ 22వ తేదీ వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 21వ తేదీన ప్రత్యేక కేటగిరీల ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపిక, 26వ తేదీన ఆప్షన్ల మార్పు, 28వ తేదీన సీట్లు కేటాయించనున్నారు. 29, 30వ తేదీల్లో సీట్లు లభించిన విద్యార్థులు కళాశాలలకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

ఉద్యోగుల స్పందనకు 4 వినతులు



ఉద్యోగుల స్పందనలో వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగుల స్పందనకు వచ్చే వినతులు సకాలంలో పరిష్కరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఉద్యోగుల స్పందన వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉద్యోగులు వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ గ్రీవెన్స్‌కు 4 దరఖాస్తులు అందాయని తెలిపారు.

సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



సీహెచ్‌సీలో ఆరోగ్యశ్రీ సేవలపై వివరాలు అడుగుతున్న ఐటీడీఏ పీఓ కల్పన కుమారి

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి(సీహెచ్‌సీ)ని ఐటీడీఏ పీఓ కల్పన కుమారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉన్నారా లేరా అని ప్రశ్నించారు. కొందరు రోగులతో ఆమె నేరుగా మాట్లాడారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. మందుల కొరత రాకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు. ఆరోగ్యశ్రీలో ఆరోగ్య మిత్ర ద్వారా పేదలకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య ఆసరా, డయోలసిస్‌పై రోగులకు తెలియజేయాలన్నారు. సీహెచ్‌సీలో అభివృద్ధి పనుల్లో భాగంగా ఫ్లోరింగ్ టైల్స్ దారి మధ్య లో ఉండడంతో వాటిని స్టోర్‌రూమ్‌లో పెట్టాల ని సూచించారు. ముందుగా ఆస్పత్రి ఓపీని, టెస్టింగ్ ల్యాబ్‌లను పరిశీంచి, జనరల్ వార్డు, చిన్నపిల్లల వార్డులకు వెళ్లి రోగులతో వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అనిత, సునీత, మన్మధరావు, రాజా, దేవిప్రసాద్, షణ్ముఖరావులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సమావేశం రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఈ నెల 19వ తేదీన జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు, చల్లా జగదీష్ తెలిపారు. జిల్లా పరిషత్ సమీపంలోని ఎన్‌జీఓ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే ఈ సమావేశానికి సంఘ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, జిల్లా నలుమూలల మాస్టర్ అథ్లెట్స్ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ క్రీడా మైదానంలో 42వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు జరగనున్నాయని చెప్పారు. ఈ పోటీల్లో 35 నుంచి 90 ఏళ్ల మధ్య వయస్సు కలిగి రన్స్, త్రోస్, జంప్స్ ప్రావీణ్యం కలిగినవారు ఎవరైనా హాజరు కావచ్చని నారాయణరావు, అప్పారావు, జగదీష్ సూచించారు. వివరాలకు 9440257020, 9989510539 నంబర్లను సంప్రదించాలని కోరారు.

టీ ట్వంటీ రాష్ట్ర క్రికెట్ జట్టుకు నవ్య ఎంపిక

నరసన్నపేట: ఏసీఏ ఆధ్వర్యంలో అండర్–23 మహిళల టీ ట్వంటీ రాష్ట్ర క్రికెట్ జట్టుకు నరసన్నపేటకు చెందిన బూసి నవ్య ఎంపికై ంది. శుక్రవారం అండర్–23 మహిళా టీ ట్వంటీ క్రికెట్ రాష్ట్ర జట్టును ఏసీఏ ప్రకటించింది. ఇందులో ఉన్న 15 మంది సభ్యుల్లో నవ్య ఒకరు. నవ్య బౌలింగ్, బ్యాటింగ్‌లలో సత్తా చాటుతోంది. దీనిపై జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ సభ్యులు గొద్దు చిట్టిబాబు నవ్యను అభినందించారు. నవ్య కోచింగ్ కోసం మంగళగిరికి శుక్రవారం పయనమైంది.

పరిశ్రమ యేవ జయతే

జీడి పరిశ్రమలు, రైస్ మిల్లులు, పేపర్ మిల్లులు, డెయిరీ పరిశ్రమలు.. పెద్ద పెద్ద భవంతులు కనిపించక పోయినా ఇలాంటి సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలే ఆయా ప్రాంతాలను సుభిక్షంగా ఉంచుతాయి. వైఎస్సార్ సీపీ సర్కారు ఈ తరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తోంది. గత నాలుగేళ్ల గణాంకాలే దీనికి నిదర్శనం. జిల్లాలో 2019 సంవత్సరానికి మునుపు జిల్లాలో 6,519 యూనిట్ల పరిశ్రమలు ఉండేవి. కానీ 2020 నుంచి 2023 వరకు వైఎస్ జగన్ సర్కారు ఏకంగా 5,538 పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందించింది. ఇవి పాతిక వేల మందికి ఉపాధి చూపించాయి. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీలు ప్రకటించడంతో పాటు పరిశ్రమల పార్కు కోసం ప్రభుత్వం స్థలాలను కూడా సిద్ధం చేస్తోంది.



కోటబొమ్మాళి సమీపంలో జర్జంగి వద్ద గ్రానైట్ పాలిసింగ్ పరిశ్రమలు.

ఏర్పాటు సులభతరం

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా ఎంఎస్ఎంఈల ఏర్పాటును ప్రభుత్వం సులభతరం చేసింది. ఇందులో భాగంగా పరిశ్రమల ఏర్పాటు కోసం రాయితీలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఎంతో ప్రోత్సాహకరంగా ప్రభుత్వం రాయితీలు అందజేస్తోంది.

– ఆర్‌వీ రమణారావు, ఏడీ, జిల్లా పరిశ్రమల శాఖ

గ్రామానికి దగ్గరలో ఉపాధి



మా గ్రామానికి దగ్గరలో జీడి పిక్కల పరిశ్రమను ఏర్పాటు చేశారు. దీంతో ఊరికి దగ్గరగా ఉపాధి దొరికింది. ఇంతకు మునుపు కేవలం వ్యవసాయ పనులపై ఆధారపడాల్సి వచ్చేది. రెండేళ్ల కిందట ఇక్కడ జీడి పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల ఉపాధి దొరికింది.

– జె.లక్ష్మీకాంతం, జీడి కార్మికురాలు, సవరకిల్లి, టెక్కలి మండలం.

- వైఎస్సార్ సీపీ సర్కారు హయాంలో పెరిగిన సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు
- ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు అత్యధికంగా సబ్సిడీలు ప్రకటించిన ప్రభుత్వం
- గుర్తింపు లేని ఎంఎస్ఎంఈల నమోదుకు ప్రత్యేక అవకాశాలు
- జిల్లాలో పరిశ్రమల పార్కు కోసం పలాస వద్ద 60.84 ఎకరాల గుర్తింపు

టెక్కలి: జిల్లాలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రతి పరిశ్రమ యజమానికి వ్యాపారంలో ఆర్థిక కష్టాలు లేకుండా ప్రభుత్వమే తోడుగా నిలిచేలా సరికొత్త విధానాలు అమలు చేస్తోంది. దీంతో పాటు ఐడీపీ 2023–27 పాలసీ విధానం మరింత ప్రోత్సాహకరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లులు, గ్రానైట్ పరిశ్రమలు, జీడి పరిశ్రమలు, కొబ్బరి పరిశ్రమలు, మందుల తయారీ పరిశ్రమలు, పేపర్ మిల్లులు, జ్యూట్ పరిశ్రమలు, డెయిరీ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, నూనె మిల్లులు, మినరల్ పరిశ్రమలతో పాటు మరి కొన్ని పరిశ్రమలు కలిపి ప్రస్తుతం 12,057 పరిశ్రమలు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 43,648 మంది ఉపాధి పొందుతున్నారు. అయితే గత ప్రభుత్వం వరకు అంటే 2019 వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 6519 ఎంఎస్ఎంఈలు ఉండగా వీటి ద్వారా సుమారు 18,557 మంది ఉపాధి పొందేవారు. 2020 నుంచి 2023 వరకు జిల్లాలో 5,558 ఎంఎస్ఎంఈల ఏర్పాటుతో సుమారు 25,091 మంది ఉపాధి లభించింది.

మరింత ప్రోత్సాహం



ప్రభుత్వం అమలు చేసిన ఐడీపీ 2023–27 పాలసీ విధానంతో ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు చెందిన పారిశ్రామిక వేత్తలకు మరింత చేయూతనిచ్చేందుకు ఈ పథకం ప్రవేశపెట్టారు.

- ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేసేందుకు జనరల్, బీసీ వర్గాల వారికి 15 శాతం పెట్టుబడితో రూ.20 లక్షల వరకు సబ్సిడీ ఇస్తారు. అదే మహిళలకు రూ.30 లక్షలకు మించకుండా సబ్సిడీ ఇస్తారు.
- ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి వంద శాతం సబ్సిడీతో ఐదేళ్ల వరకు 3 శాతం వడ్డీ రాయితీతో రూ.25 లక్షలకు మించకుండా ఐదేళ్ల వరకు విద్యుత్ సబ్సిడీలు అందజేస్తారు.
- జగనన్న బడుగు వికాస పథకం కింద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 45 శాతం పెట్టుబడికి రూ.1.20 లక్షల వరకు రాయితీ ఇస్తారు. అలాగే రవాణా కోసం రూ.75 లక్షల వరకు సబ్సిడీ ఇస్తారు. వీటితో పాటు వడ్డీ రాయితీ 9 శాతంతో 50 లక్షలకు మించకుండా ఐదేళ్ల వరకు ఇస్తారు. విద్యుత్ రీయింబర్స్‌మెంట్ సైతం వర్తించే విధంగా ప్రణాళిక రూపొందించారు.

ఎంఎస్ఎంఈల గుర్తింపు

ప్రభుత్వ గుర్తింపు లేని ఎంఎస్ఎంఈలకు ప్రత్యేకంగా నమోదు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 'ఉద్యం' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పోర్టల్‌లో నమోదైన ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వ రాయితీలు అందజేస్తారు.

పలాసలో పారిశ్రామిక పార్కు

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా ఒకే చోట పరిశ్రమల అభివృద్ధితో పాటు పెట్టుబడి దారులకు సులభతరంగా ఉండేందుకు పారిశ్రామిక పార్కులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పలాస సమీపంలో గల రామకృష్ణాపురం వద్ద 60.84 ఎకరాలను గుర్తించారు. సుమారు 76 పరిశ్రమలను ఏర్పాటు చేసేలా ఒక్కో పరిశ్రమకు సుమారు 2 వేల చదరపు అడుగులు కేటాయించారు.

అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి



మృతుడు సోమేష్

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ గ్రామానికి చెందిన తాళ్లవలస సోమేష్ (39) తలకు గాయమై గురువారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతదేహాన్ని ఎచ్చెర్ల ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించి శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం కోసం పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్యం మత్తులో ఉన్న సోమేష్ గురువారం శ్రీకాకుళం నుంచి పొన్నాడ వస్తున్న టాటా ఏస్ ఎక్కి ఇంటి దగ్గర దిగాడు. అయితే ఆ వాహనంలో ఉన్న సైకిల్‌ను కిందకు దించడం మర్చిపోవడంతో వెళ్తున్న బండిని ఆపి వాహనంలో ఉన్న జావాన చిన్నారావు సహకారంతో సైకిల్ కిందకి దించారు. సైకిల్‌ను తీసుకు వెళ్తున్న క్రమంలో వెనక్కి పడిపోగా తలకు బలమైన గాయమైంది. ఈ గాయానికి స్థానిక ఆర్‌ఎంపీ వైద్యునితో ప్రథమ చికిత్స చేయించుకోగా.. అతను ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబ సభ్యులు మాత్రం మద్యం మత్తు వల్ల అపస్మారక స్థితికి చేరాడని భావించి విడిచిపెట్టేశారు. దీంతో గురువారం రాత్రి ఆయన మృతి చెందారు. అయితే గ్రామంలో కొందరు సోమేష్‌ను వెనక్కు నెట్టటం వల్లనే మృతి చెందాడని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రాథమికంగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడు ఇటుక పరిశ్రమల్లో రోజు కూలీగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య రాజేశ్వరి, కుమార్తె దీపిక, కుమారుడు తరుణ్ ఉన్నారు.

21 నుంచి 3వ జోన్ గ్రిగ్స్ పోటీలు

గార: కె.మత్స్యలేశం బుద్ధా పాఠశాలలో ఈ నెల 21 నుంచి 3వ జోన్ గ్రిగ్స్ పోటీలు జరుగుతాయని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎస్.తిరుమలచైతన్య, జిల్లా పాఠశాలల క్రీడల సంఘ సహాయ కార్యదర్శి కె.మాధవరావులు తెలిపారు. ఈ పోటీలకు శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గ పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఇటీవల జరిగిన గ్రిగ్స్ పోటీల్లో గెలుపొందిన రన్నర్లు, విన్నర్లు బాలబాలికల జట్లు పాల్గొనాలని తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నీ కాయిట్, షటిల్ క్రీడల పోటీలు జరుగుతాయన్నారు. ఇక్కడ గెలుపొందిన వారు డిసెంబర్‌లో నిర్వహించనున్న జిల్లాస్థాయి గ్రిగ్స్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 21, 22వ తేదీల్లో బాలురు, 23, 24వ తేదీల్లో బాలికలు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు ఏఎన్‌యూ కోచ్‌గా బాలకృష్ణ



శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ సౌత్‌జోన్ అంతర్‌యూనివర్సిటీ మహిళల కబడ్డీ పోటీలకు కోచ్‌గా జిల్లాకు చెందిన ఎన్‌ఐఎస్ క్వాలిఫైడ్ కబడ్డీ కోచ్ ఎం.బాలకృష్ణ నియామకమయ్యారు. ఈ పోటీల్లో పాల్గొనే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూ), గుంటూరు మహిళల జట్టుకు కోచ్‌గా ఈయనను నియమిస్తూ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ పి.జాన్సన్ ఉత్తర్వులు వెలువరించారు. ఈ పోటీలు ఈ నెల 22 నుంచి 25 వరకు తమిళనాడు రాష్ట్రం అలగప్పా యూనివర్సిటీ వేదికగా జరగనున్నాయి. బాలకృష్ణ శ్రీకాకుళం నగరంలోని సన్ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ పనిచేస్తున్నారు. కళాశాల డైరెక్టర్లు పి.జయరాం, ఎల్.కామేష్, పి. మురళీకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

'రైతులకు న్యాయం చేస్తాం'



చిన్నసున్నాపురంలో ఎండిన వరి పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్

మెళియాపుట్టి: ఎండిపోయిన వరి పంట పొలాలకు సంబంధించి పారదర్శకంగా పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని, రైతులు అధైర్యపడవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని చిన్న సున్నాపురం, డేగల పోలూరు గ్రామాల్లో పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. రైతులందరికీ న్యాయం చేసే దిశగా అధికారులు పనిచేస్తున్నారని, ప్రతి రైతు పంటకోత ప్రయోగాలు చేయించుకోవాలని సూచించారు. తద్వారా వైఎస్సార్ ఈ–క్రాప్ ఇన్సూరెన్స్ వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు 50శాతం రాయితీపై కట్టిజనుము విత్తనాలను పంపిణీ చేశారు. రైతులకు ఉన్న సందేహాల నివృత్తి కోసం రైతుభరోసా కేంద్రాలను సందర్శించాలని కోరారు. మండల ప్రత్యేక అధికారి భవానీ శంకర్, తహసీల్దార్ సరోజిని, మండల వ్యవసాయ శాఖ అధికారి దానకర్ణుడు, ఆర్‌ఐ వైకుంతరావు, వీఏఏలు శరత్, షణ్ముఖరావు, వీఆర్వోలు శామ్యూల్, రత్నం, సత్యనారాయణ, పలువురు రైతులు ఉన్నారు.

'విద్యార్థుల్లో నైపుణ్య కల్పనకు ప్రాధాన్యత'

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్య కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్‌గా ఈనెల 24వ తేదీతో మూడేళ్ల టెర్మ్ పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం డైరెక్టర్‌కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి సత్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలో ప్రతిభావంతమైన గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరిట్ మార్కులు సాధించిన ఈ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ లక్ష్యంగా ట్రిపుల్ ఐటీ విద్య కొనసాగుతుందని అన్నారు. రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు, నాలుగేళ్ల ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు మంచి ప్యాకేజీలతో క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపిక అవుతున్నారని, మరో పక్క ఉన్నత విద్యలో, ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో రాణిస్తున్నారని తెలిపారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ క్యాంపస్‌లో శ్రీకాకుళం నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో పాలకొండలో త్వరలో నిర్వహించనున్న పెట్రోల్ బంకులో ఉద్యోగాలకు గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గౌరవ వేతనంపై పనిచేయడానికి సూపర్‌వైజర్ ఒక పోస్టుకు ఏదైనా డిగ్రీ పాసై ఉండాలన్నారు. పంప్‌బాయ్ 7 పోస్టులకు ఇంటర్మీడియెట్ అర్హత ఉండాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట, పాలకొండ, వీరఘట్టం, భామిని మండలాలు, శ్రీకాకుళం జిల్లాలో కొత్తూరు, హిరమండలం, పాతపట్నం, మందస, మెళియాపుట్టి, కంచిలి, సోంపేట, పలాస, టెక్కలి, నందిగాం, జలుమూరు, బూర్జ, లావేరు, సురుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట మండలాలకు చెందిన పరిసర గ్రామాల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు ఈ నెల 27లోగా ఐటీడీఏలోని పరిపాలనాధికారి కార్యాలయానికి అందజేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. నల్లగొండ జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన భుగత అనిల్(22) కుటుంబం 15ఏళ్ల క్రితం హైదరాబాద్‌లోని దమ్మాయిగూడ అంబేడ్కర్ నగర్‌లో స్థిరపడింది. అనిల్ హైదరాబాద్‌లోనే ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. డిప్లమా సరిఫికెట్లు తెచ్చుకునేందుకు అనిల్ శుక్రవారం ఉదయం తన బైక్‌పై ఒంగోలుకు బయలుదేరాడు. మార్గమధ్యలో నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో మహారాష్ట్ర నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న లారీ ఎదురుగా అనిల్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనిల్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి లారీడ్రైవర్ రిజ్వాన్‌ఖాన్ నిర్లక్ష్యపు డ్రైవింగే కారణమని పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి జగన్నాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ ఎన్.ధర్మ తెలిపారు.

వెలుగు సీఎఫ్ చేతివాటం

- స్పందన ఫిర్యాదుతో వెలుగులోకి అక్రమాలు



సంతబొమ్మాళి వెలుగు కార్యాలయం

సంతబొమ్మాళి: నౌపడ పంచాయతీ పాలనాయుడుపేట గ్రామ సమైక్య సంఘానికి చెందిన వెలుగు సీఎఫ్ చేతివాటం ప్రదర్శించారు. సుమారు రూ.2,40,000లు తన సొంతానికి వాడుకొని అక్రమాలకు పాల్పడ్డారు. దీనిపై స్పందనలో ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే నౌపడ పంచాయతీ పాలనాయడుపేట గ్రామ సమైక్య సంఘం సీఎఫ్ సుమలత మూడేళ్లుగా సంఘ సభ్యుల డబ్బులు కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. డ్వాక్రా గ్రూప్ సభ్యులు తీసుకున్న అప్పును తీర్చడానికి ఇచ్చిన డబ్బులను సొంతానికి వాడుకున్నారు. స్త్రీనిధి, సీఐఎఫ్ తీసుకున్న అప్పును తీర్చడానికి సంఘ సభ్యులు ఇచ్చిన డబ్బులను తన సొంత అవసరాలకు వినియోగించుకున్నారు. అలాగే పొదుపు నుంచి తీసిన డబ్బులను సమృద్ధి ఖాతాకు మళ్లించకుండా అవసరాలకు సీఎఫ్ వినియోగించుకుంది. ఇలా పలు సంఘాల నుంచి రూ. 2,40,000 డబ్బులు కాజేసినట్లు తేలింది. బాబా గ్రూపు నుంచి రూ. 45వేలు, సాగర కన్య గ్రూపు నుంచి రూ. 48వేలు, జై సంతోషిమాత గ్రూపు నుంచి రూ. 7500, పెద్దమ్మ తల్లి గ్రూపు నుంచి రూ.7500, భాస్కరమ్మ గ్రూపు నుంచి రూ. 7500లు, రామకృష్ణ గ్రూప్ నుంచి రూ. 7200లు, అమ్మభవాని గ్రూపు నుంచి రూ. 7200లు, మధుప్రియ గ్రూపు నుంచి రూ. 7200లు, కొత్తమ్మతల్లి గ్రూపు నుంచి రూ. 8.400లు, నూకాలమ్మ గ్రూపు నుంచి రూ. 7200లు, శ్రీ దత్త గ్రూపు నుంచి రూ. 7500లు, సాయిసంతోషి గ్రూపు నుంచి రూ. 7500 కాజేసినట్లు తేలింది. దీంతోపాటు ఎలాంటి తీర్మానం లేకుండా గ్రూపు సభ్యులకు తెలియకుండా తన సొంత గ్రూపు అయినా లక్ష్మీ గణపతి గ్రూప్ నుంచి రూ. 30వేలు విత్ డ్రా చేసుకుని సొంతానికి వాడేసుకుంది. దీనిపై పలువురు సభ్యులు జిల్లాస్థాయి స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై వెలుగు ఏపీఎం సూర్యనారాయణ మాట్లాడుతూ సీఎఫ్ సుమలత వివిధ డ్వాక్రా రూపుల నుంచి రూ. 2,40,000 సొంతానికి వాడుకున్నట్లు గుర్తించామని చెప్పారు. దీనికి సంబంధించిన రికార్డులు తమకు ఇవ్వలేదని, సమావేశాలకు కూడా ఆమె గైర్హాజరవుతున్నారని పేర్కొన్నారు.

తీరానికి భారీ తిమింగలం



తీరానికి చేరిన భారీ తిమింగలం

సంతబొమ్మాళి: భావనపాడు సముద్రతీరానికి భారీ తిమింగలం కళేబరం శుక్రవారం కొట్టుకువచ్చింది. ఉదయం సముద్రంపై వేటకు వెళ్లిన మత్స్యకారులు దీన్ని గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. ఈ భారీ తిమింగలం 15 మీటర్ల పొడవు, పదిటన్నుల బరువు ఉంటుందని మత్స్యకారులు అంటున్నారు. ఇది సముద్రంలోనే మృతి చెంది ఒడ్డుకు చేరడంతో దుర్వాసన వస్తోందని తెలిపారు. సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని కళేబరాన్ని గోతిలో పూడ్చారు.

12 అడుగుల కొండ చిలువ మృతి



ఆమదాలవలస రూరల్: మండలంలో చిన్నజొన్నవలస గ్రామం సమీపంలో వంశధార కుడి కాలువ వద్ద అలికాం–బత్తిలి ఏబీ రోడ్డుపై భారీ కొండ చిలువ శుక్రవారం మృతిచెంది కనిపించింది. ఈ కొండ చిలువ సుమారు 12 అడుగుల పొడవు ఉంది. రాత్రి వేళ రోడ్డు దాటే సమయంలో వాహనాల కింద పడి మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు.

ఎస్‌ఈ కార్యాలయం వద్ద పీఆర్ ఇంజినీర్ల బైఠాయింపు



ఎస్‌ఈ చాంబర్ వద్ద బైఠాయించిన పీఆర్ ఇంజినీర్లు

అరసవల్లి: పంచాయతీ రాజ్ సూపరింటెండింగ్ ఇంజినీర్ వీఎస్ఎన్ మూర్తి వ్యవహార శైలితో ఇబ్బందులు పడుతున్నామని పీఆర్ ఇంజినీర్లంతా ఎస్‌ఈ కార్యాలయం వద్ద శుక్రవారం బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల విషయంలో ఉన్నతాధికారుల నుంచి తమకు తీవ్ర ఒత్తిళ్లు ఉన్నాయని, వీటిని పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారి విధులకు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని పీఆర్ ఇంజినీర్ల సంఘ అధ్యక్షుడు కేసీహెచ్ మహంతి ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజినీర్లంతా ఎస్‌ఈ తీరుపై మండిపడుతున్నారని, ఆయన వారంలో ఒక రోజే వస్తున్నారని, దీంతో పనుల పర్యవేక్షణ నిలిచిపోతోందని, ఇలాంటి అనాలోచిత నిర్ణయాలను ఖండిస్తున్నామని మహంతి ప్రకటించారు. శుక్రవారం ఉదయం నుంచి ఎస్‌ఈని కలిసేందుకు కార్యాలయానికి వస్తే, ఆయన అందుబాటులో లేకపోగా ప్రభుత్వం ఇచ్చిన అధికారిక ఫోన్‌ను కూడా స్విచ్ ఆఫ్ చేశారని తెలిపారు. శనివారం నుంచి జేఏసీ పక్షాన ఉద్యమ కార్యాచరణను ప్రకటించి తదుపరి చర్యలు తీసుకుంటామని జేఏసీ సెక్రటరీ జనరల్ కేసీహెచ్ మహంతి, కో చైర్మన్లు ఎస్.శ్రీరాములు, ఎస్‌పీఏ పోలినాయుడు, జె.నగేష్ పట్నాయక్ తదితరులు ప్రకటించారు. దీనిపై పిఆర్ ఎస్‌ఈ వీఎస్ఎన్ మూర్తిని 'సాక్షి' సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

యువ జంట ఆత్మహత్య



పలాస రైల్వేస్టేషన్ గూడ్స్ లైన్ పట్టాలపై యువతీ, యువకుల మృతదేహాలు, పక్కనే ఆధార్‌కార్డులు

కాశీబుగ్గ: ఇద్దరిదీ ఈ ప్రాంతం కాదు. ఎందుకు వచ్చారో, ఏం జరిగిందో తెలీదు. పలాస రైల్వే స్టేషన్‌లో దిగారు. పాప్‌కార్న్ కొన్నారు. స్టేషన్‌లోనే నవ్వుతూ, తుళ్లుతూ తిరిగారు. కాసేపు అక్కడున్న బెంచీలపై కూర్చుని మాట్లాడుకున్నారు. ఇంతలోనే ఏం జరిగిందో గానీ అమ్మాయి గూడ్స్ రైలు కింద పడి చనిపోయింది. దాన్ని ఆపేందుకు ప్రయత్నించిన అబ్బాయి విఫలమై రైలు పట్టాలపై తలపెట్టి ప్రాణాలు అర్పించాడు. పలాస రైల్వేస్టేషన్‌లో శుక్రవారం రాత్రి జరిగిన సంచలనంగా మారింది. పలాస జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ ప్రాంతానికి చెందిన రంజన్ రాయ్ అనే యువతి, తుషారింగ్ తాషీ షెర్పా అనే యువకుడు శుక్రవారం పలాస స్టేషన్‌లో దిగారు. నవ్వుతూ మాట్లాడుకుంటూనే మూడో నంబర్ ప్లాట్‌ఫారంపై నుంచి పట్టాలపైకి దిగారు. ముందు రంజన్ రాయ్ గూడ్స్ రైలు కింద తలపెట్టి చనిపోయింది. ఆమెను ఆపలేకపోవడంతో యువకుడు కూడా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే సిబ్బంది వారి వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు తెలుసుకున్నారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. మృతదేహాలను పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో మార్చురీ విభాగానికి తరలించారు.

ఓటు ప్రాముఖ్యత తెలుసుకోండి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్



స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జిల్లా అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటు హక్కు ప్రాముఖ్యత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. పురుషుల ప్రభుత్వ కళాశాల మైదానంలో గురువారం ఉదయం ఏర్పాటు చేసిన స్వీప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. జిల్లా జనాభాలో 18 ఏళ్లు నిండిన 46 వేలమంది యువత ఉండగా వారిలో 18 వేల మంది మాత్రమే ఓటర్లుగా నమోదయ్యారని చెప్పారు. మిగిలిన వాళ్లు కూడా ఓటర్లుగా చేరాలన్నదే స్వీప్ కార్యక్రమం లక్ష్యమన్నారు. జిల్లాలో 2500 మంది అధికారులు 24 లక్షల మంది ఓటర్ల జాబితా తయారీలో ఎంతో శ్రమతో పనిచేస్తారని, అన్ని వర్గాల సహాయ సహకారాలతోనే అది సాధ్యమన్నారు. ఈ రోజు నుంచి డిసెంబర్ నెల వరకు నమోదు ప్రక్రియ సాగుతుందని, అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వీప్ కార్యక్రమాల్లో యువత ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ఓటు హక్కు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం వాకర్స్, విద్యార్థులు కలిసి ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకూ ర్యాలీగా వెళ్లారు. అక్కడే వారితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, రెవెన్యూ డివిజనల్ అధికారి సీహెచ్ రంగయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్, తహసీల్దార్ కె.వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.